సాక్షి తిరుపతి

శుక్రవారం । 3 । నవంబర్ । 2023



రాంగ్ రూట్లో వెళ్లొద్దు..

శ్రీనివాస సేతు వంతెనపై వాహనదారులు రాంగ్ రూట్లో వెళ్లొద్దని ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. - IIలో



ఆక్టోపస్ మాక్ డ్రిల్

అసాంఘిక శక్తులు దాడులకు పాల్పడితే ఎలా రక్షించుకోవాలో ఆక్టోపస్ దళాలు అవగాహన కల్పించాయి. - IIలో

శ్రీవారి సేవలో ప్రముఖులు



తిరుమల శ్రీవారిని రాష్ట్ర మంత్రులు ఆర్‌కే రోజా, చెల్లుబోయిన వేణుగోపాల కృష్ణ, ఏపీ ఎథిక్స్ కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు దర్శించుకున్నారు.

న్యూస్‌రీల్

ముక్కంటి సేవలో రష్యా దేశస్తులు



ఆలయ ధ్వజస్తంభం వద్ద రష్యా దేశస్తులు

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని గురువారం సుమారు 20మంది రష్యా దేశస్తులు దర్శించుకున్నారు. ఆలయదక్షిణ గోపురం వద్ద అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా వారు రాహుకేతు సర్పదోష నివారణ పూజలు చేయించుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించారు.

శాస్త్రోక్తం.. త్రిశూలస్నానం



త్రిశూలానికి చక్రస్నానం నిర్వహించిన అర్చకులు

చంద్రగిరి: తొండవాడ స్వర్ణముఖీనది ఒడ్డున వెలసిన శ్రీఅగస్త్యేశ్వరస్వామి (రుద్రపాదాల ముక్కోటి) ఆలయంలో రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా త్రిశూల స్నాన ఘట్టాన్ని వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం స్వామివారిని సుప్రభాత సేవతో మేల్కొలి ఫల, పుష్ప సుగంధ ద్రవ్యాలతో అభిషేక సేవ, చందనాభిషేకం నిర్వహించి విశేష అలంకరణ చేశారు. అలాగే భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త మొగిలి రఘురామిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వేడుకగా త్రిశూల స్నానం..

రుద్రపాదాల ముక్కోటి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం 9 నుంచి 9.30 గంటల మధ్య త్రిశూల చక్రస్నాన ఘట్టాన్ని వేడుకగా నిర్వహించారు. అనంతరం సాయంత్రం 6 గంటలకు రావణాసుర వాహనంపై స్వామి, అమ్మవార్లు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి 7.30గంటల మధ్య ధ్వజావరోహణ కార్యక్రమంతో ఉత్సవాలు పరిసమాప్తమయ్యాయి.

నేడు డయల్ యువర్ ఈఓ


తిరుమల: డయల్ యువర్ ఈఓ కార్యక్రమం శుక్రవారం ఉదయం 9 నుంచి 10 గంటల వరకు తిరుమల అన్నమయ్య భవనంలో జరుగనుంది. ఈ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. ఈ కార్యక్రమంలో భక్తులు తమ సందేహాలను, సూచనలను టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డికి ఫోన్ ద్వారా నేరుగా మాట్లాడి తెలుపవచ్చు. భక్తులు 0877–2263261 నంబర్‌లో సంప్రదించవచ్చు.



చిత్తూరులో సామాజిక సాధికార బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహిని (ఇన్‌సెట్) బస్సు యాత్రలో డిప్యూటీ సీఎంలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు



విజయయాత్ర



సభావేదిక వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్రకు అనూహ్య స్పందన లభించింది. అభిమాన కెరటం ఉవ్వెత్తున ఎగసిపడింది. సంక్షేమ ఎ'జెండా' దిగ్విజయంగా ఎగరడం కనిపించింది. సంక్షేమం పొందిన వారంతా స్వచ్ఛందంగా తరలిరావడంతో చిత్తూరు జనసంద్రమైంది. తమ బతుకుల్లో వచ్చిన మార్పును గుర్తుచేసుకుని కరతాళ ధ్వనులతో కృతజ్ఞతలు తెలిపారు. జై జగన్ నినాదాలతో సభాప్రాంగణం హోరెత్తింది. మళ్లీ జగనన్నే రావాలంటూ యువతరం నినదించింది.

- సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం
- చిత్తూరు జన సంద్రం
- పోటెత్తిన అభిమానం!
- కిక్కిరిసిన సభాప్రాంగణం





సభావేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఉపముఖ్యమంత్రులు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

చిత్తూరు కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర చిత్తూరులో దిగ్విజయమైంది. తొలుత మంత్రులు, ప్రజాప్రతినిధులు స్థానిక కట్టమంచిలోని ఓ కల్యాణ మండపంలో తటస్థులు, ప్రతిభావంతులతో సమావేశమయ్యారు. అనంతరం బస్సుపైకి ఎక్కి యాత్రగా కట్టమంచి, పాతకోర్టు, హైరోడ్డు మీదుగా నాగయ్య కళాక్షేత్రం వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఉపముఖ్యమంత్రులు నారాయణస్వామి, అంజాద్‌బాషా, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్కే రోజా, ఎంపీలు బీద మస్తాన్‌రావు, చంద్రశేఖర్, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు, వెంకటేగౌడ, నగర మేయర్ అముద, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్, రాష్ట్ర ప్రభుత్వ విదేశీ సలహాదారుడు జ్ఞానేంద్రరెడ్డి, వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆర్టీసీ వైస్ చైర్మన్ ఎంసీ విజయానందరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి భారీ బైక్ ర్యాలీ



ఎగరాలీ.. ఎగరాలీ పేదల జెండా ఎగరాలి

వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తున్న అభిమాని

నీరా 'జనాలు'

- స్థానిక కట్టమంచి నుంచి హైరోడ్డు మీదుగా ఎంఎస్ఆర్ సర్కిల్ పై నాగయ్య కళాక్షేత్రం వరకు యాత్ర సాగింది.
- నగరంలోని ప్రధాన కూడళ్ల వద్ద ప్రజలు యాత్రకు అపూర్వ స్వాగతం పలికారు.
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు.
- దారి పొడవునా జై జగన్.. జైజై జగన్ నినాదాలు మిన్నంటించారు.
- పూలదండలతో నాయకులకు ఆహ్వానం పలికారు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు పింఛన్‌దారులు, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు స్వచ్ఛందంగా తరలివచ్చారు.

బాబు పతనం ఖాయం



14 ఏళ్లు సీఎంగా ఉన్నప్పుడు చేసిన తప్పులకు బాబు జీవితాంతం జైలులోనే ఉంటాడు. ఎల్లో మీడియాను నమ్ముకొని రానున్న ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని బాబు కలలు కనడం మానుకోవాలి. ఎన్నికల సమయంలో అట్టడుగు వర్గాలు లేకపోతే టీడీపీ లేదు. కంటి ఆపరేషన్ కోసం బెయిల్ పై వచ్చిన బాబు, భవిష్యత్‌లో కిడ్నీ, క్యాన్సర్, బొల్లి ఆపరేషన్ సాకుతో బెయిల్ కోరతాడు అనడంలో ఆశ్చర్యం లేదు. బాబుది రౌడీ రాజకీయం.

– నారాయణస్వామి, ఉప ముఖ్యమంత్రి

చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అడ్డా



ఉమ్మడి చిత్తూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అడ్డా. కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో టీడీపీ చిత్తుగా ఓడిపోవడంతో చంద్రబాబుకు మతి తప్పింది. పెద్దిరెడ్డి దెబ్బకు బాబు అబ్బ అన్నాడు. బాబు వేషాలు వేయడం, మోసాలు చెయ్యడంలో దిట్ట. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలను ఎన్నికల సమయంలో మోసం చేయడం అలవాటుగా చేసుకున్నారు. 'అపు బాబు మీ నాటకం..జగనన్న మా నమ్మకం'.

– వేణుగోపాల్, మంత్రి

మైనారిటీలకు పెద్దపీట



మైనారిటీలకు ప్రాధాన్యత కల్పించి వారికి పదవులు, సంక్షేమంలో జగనన్న పెద్దపీట వేశారు. మైనారిటీ వర్గానికి చెందిన నాకు ఉపముఖ్యమంత్రిగా అవకాశం కల్పించారు. రాజకీయ పార్టీలు, పత్రికలు, టీవీలను జగనన్న నమ్ముకోలేదు. దేవుడు, ప్రజలను మాత్రమే నమ్ముకొని పాలన సాగిస్తున్నరు. రానున్న ఎన్నికల్లో పేదలు–పెత్తందారు మధ్యే యుద్ధం జరుగుతుంది. బాబు, పవన్ పెత్తందారులు అయితే జగనన్న పేదల పక్షాన నిలబడ్డారు.

– అంజాద్‌బాషా, ఉప ముఖ్యమంత్రి

బీసీలకు ప్రాధాన్యం



రాజ్యసభలో 8 ఎంపీ స్థానాలుంటే అందులో సగం మంది బీసీలకు అవకాశం ఇచ్చారు. గతంలో టీడీపీ మూడు సార్లు నాకు రాజ్యసభ సీటు ఇస్తానని చెప్పి మోసం చేసింది. బీసీలకు బాబు చేసిందేమీ లేదు. బీసీల జనగణన చేయడానికి జగనన్న సముఖత చూపారు. ఉమ్మడి జిల్లాలో అన్ని సీట్లు గెలిపించి జగనన్నను ముఖ్యమంత్రిని చేయండి.

– బీద మస్తాన్‌రావు, ఎంపీ రాజ్యసభ

'శెట్టిపల్లి భూసమస్య పరిష్కారం ఓ చరిత'



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి



సమావేశంలో పాల్గొన్న రైతులు



భూహక్కు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

- దశాబ్దాల సమస్యను పరిష్కరించాం
- అత్యంత సంతృప్తినిచ్చిన విషయం ఇదే
- భూముల ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యే భూమన

సాక్షి, తిరుపతి: 'దశాబ్దాల సమస్యను పరిష్కరించినందుకు సంతోషంగా ఉంది. ఈ నాలుగున్నరేళ్లలో ఎమ్మెల్యేగా అత్యంత సంతృప్తి ఇచ్చిన అంశం ఏదైనా ఉందంటే శెట్టిపల్లి గ్రామ సమస్య పరిష్కారమే' అని టీటీడీ చైర్మన్, ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. అందుకు సంబంధించి గురువారం శెట్టిపల్లిలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ప్రొసీడింగ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ శెట్టిపల్లి భూములకు సంబంధించి 348 మంది రైతులు, 2,448 మంది స్థలాలు కొనుగోలు చేసిన వారు హక్కు కోసం ఏళ్ల తరబడి పోరాడుతున్నారని తెలిపారు. 14 ఏళ్ల టీడీపీ పాలనలో శెట్టిపల్లి వాసులు అనేక పర్యాయాలు నాటి సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరూ కనికరించలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జేసీ బాలాజీ దృష్టికి తీసుకెళ్లారని చెప్పారు. శెట్టిపల్లి భూ సమస్యను భూమన కరుణాకరరెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారని, ఆయన ఆదేశాలతో కలెక్టర్, జేసీ శెట్టిపల్లి భూసమస్య పరిష్కారానికి నడుం బిగించారని తెలిపారు. 248 మంది రైతులు, 1,396 మంది ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసిన వాటికి పరిష్కారం చూపారని కొనియాడారు.

అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే..

గతంలో ఇదే సమస్యను వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన దృష్టికి తీసుకెళ్లానని, అయితే ఆయన అకాల మరణంతో మరుగున పడిపోయిందని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అన్నారు. ఏడు దశాబ్దాలకు పైగా నిలిచిపోయిన ఈ సమస్యకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక ఆయన ఆదేశాలతో కలెక్టర్, జేసీ, తహసీల్దార్ పట్టుదలతో పరిష్కారం చూపించారని అన్నారు. అధికారుల్లో చిత్తశుద్ధి ఉంటే ఎలాంటి సమస్యను అయినా పరిష్కరించగలరు అనడానికి ఈ శెట్టిపల్లి భూముల సమస్య పరిష్కారం కావడమే నిదర్శమన్నారు. తన కంటే 100 రెట్లు ఎక్కువ పని చేసింది మాత్రం అభినయ్ అని అభినందించారు.

దేవుడి మీద ప్రమాణం చేసి చెబుతున్నా..

దేవదేవుని పాదాల మీద ప్రమాణం చేసి చెబుతున్నా.. ఈ సమస్య పరిష్కారంలో ఒక్క నయా పైసా కూడా ఏ ఒక్కరి దగ్గర కూడా తీసుకోలేదని భూమన అన్నారు. అవినీతికి ఆస్కారం లేకుండా పరిష్కారం చూపడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లినప్పుడు కలెక్టర్‌కు చెప్పడం, వెంటనే జేసీ, తహసీల్దార్ సమస్య పరిష్కారానికి చూపిన తెగువ మరువలేనిదన్నారు.

ఆ ఆనందమే వేరు..

సంతోషం ఎప్పుడు కలుగుతుందంటే పరిష్కారం కాని పెద్ద సమస్య ఏదైనా తీర్చినప్పుడు. అదే నేడు సాకారమైంది. ఎమ్మెల్యే, డిప్యూటీ మేయర్ అభినయ్ కలిసినప్పుడల్లా గత 75 ఏళ్లుగా పరిష్కారం కాని సమస్యలు తెలిపేవారు. సమస్యను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం, ఆయన చొరవ చూపడం, ఇంత గొప్ప కార్యక్రమంలో మేము భాగస్వాములు అయినందుకు ఆనందంగా ఉంది.

– వెంకటరమణారెడ్డి, కలెక్టర్, తిరుపతి జిల్లా

ఒక సంకల్పంతో కృషి చేశాం..

తిరుపతి జిల్లా ఏర్పడిన రెండవరోజే ఎమ్మెల్యే భూమన శెట్టిపల్లి భూముల సమస్య గురించి చెప్పారు. మనకు స్వాతంత్రం వచ్చి ఇన్నేళ్లు అయినా సెటిల్‌మెంట్ ఆపరేషన్ ఎప్పుడో జరిగిపోయినా.. ఒక్క శెట్టిపల్లి ఎందుకు ఇలా ఉంది అనుకుని వెంటనే గ్రామంలో పర్యటించాం. రకరకాల సమస్యలు వచ్చాయి. కలెక్టర్ ఆధ్వర్యంలో మీటింగ్ ఏర్పాటు చేసి నిర్ణయాలు తీసుకున్నాం.

– డీకే బాలాజీ, జాయింట్ కలెక్టర్

చరిత్రాత్మకమైన రోజు ఇది

ఇది చారిత్రాత్మకమైన రోజు. మనందరికీ తెలుసు నాలుగున్నరేళ్లలో కార్పొరేషన్ తరఫున తిరుపతి ఏ విధంగా అభివృద్ధి చెందిందో. ఒక రోడ్లే కాదు, నీటి సమస్య కూడా లేదు. ఆరు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లను ఎమ్మెల్యే ప్రారంభించడం జరిగింది. ఒక జటిలమైన సమస్యగా మిగిలిపోయిన శెట్టిపల్లి భూ సమస్యను తీర్చడానికి ముఖ్య కారకులు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి.

– డాక్టర్ శిరీష, మేయర్

నాలుగోతరంలో సమస్య పరిష్కారం

75 ఏళ్లుగా శెట్టిపల్లి భూముల సమస్యల నలుగుతూనే ఉంది. కానీ ఈరోజు ఈ సమస్యను పరిష్కరించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుంది. గత ఎన్నికల్లో తిరుపతి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా కరుణాకర రెడ్డి నిలబడినప్పుడు శెట్టిపల్లి భూ సమస్యను కచ్చితంగా పరిష్కరిస్తామని వాగ్దానం చేశాం. ఆ మేరకు సమస్యను పరిష్కరించడం జరిగింది.

– భూమన అభినయ్ రెడ్డి, డిప్యూటీ మేయర్

మౌలిక సదుపాయాలన్నీ కల్పిస్తాం..

ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని సమస్య ఈరోజు పరిష్కారమైంది. నాలుగేళ్లుగా రెవెన్యూ యంత్రాంగం అంతా కూడా శెట్టిపల్లి భూముల సమస్యపై పనిచేయడం నేను కళ్లారా చూశాను. శెట్టిపల్లి తిరుపతి నగరపాలక సంస్థలో విలీనమైంది. నగరపాలక సంస్థలో ఉన్న వార్డులకు దీటుగా శెట్టిపల్లిని కూడా అభివృద్ధి చేయడానికి నగరపాలక సంస్థ ఎప్పుడూ ముందుంటుంది.

– హరిత, కమిషనర్, తిరుపతి కార్పొరేషన్

శ్రీవారి దర్శనానికి 8 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. బుధవారం అర్ధరాత్రి వరకు 63,710 మంది స్వామివారిని దర్శించుకోగా 21,205 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.13 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం అవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 8 గంటల్లో శ్రీవారి దర్శనం లభిస్తుండగా, ప్రత్యేక ప్రవేశ దర్శన టిక్కెట్లు కలిగిన వారికి 2 గంటల్లోనే దర్శనం అవుతోంది.

ఆకట్టుకున్న ఆక్టోపస్ మాక్‌డ్రిల్


మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్న ఆక్టోపస్, స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది

తిరుపతి క్రైమ్: అనుకోని విపత్తులు, అసాంఘిక శక్తులు ఎదురైనప్పుడు ఎలా అడ్డుకోవాలో ఆక్టోపస్ విన్యాసాలు కళ్లకు కట్టినట్లు చూపించారు. ఆక్టోపస్ అడిషనల్ ఎస్పీ నగేష్ బాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం నుంచి గురువారం తెల్లవారుజామున వరకు మాక్ డ్రిల్ నిర్వహించారు. టెర్రరిస్టులు, సంఘ విద్రోహ చర్యలను అణచివేయడంలో యుద్ధ నైపుణ్యాలు కలిగి, నిష్ణాతులైన ఆక్టోపస్ కమాండోలు, జిల్లా యంత్రాంగం స్పెషల్ పార్టీ పోలీసులు చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న విష్ణునివాసాన్ని అసాంఘిక శక్తులు టార్గెట్ చేస్తే అలాంటి సమయంలో సంఘ విద్రోహ శక్తులను ఏ విధంగా మట్టు పెట్టాలో మాక్‌డ్రిల్ చేశారు. జిల్లా ఎస్పీ పరమేశ్వర రెడ్డి, టీటీడీ ఈఓ ధర్మారెడ్డి ఆదేశాల మేరకు సన్నివేశాలు నిర్వహించారు.

ఎంతమంది ఏకమైనా వైఎస్సార్‌సీపీదే గెలుపు

- సంక్షేమం, అభివృద్ధే గెలిపిస్తాయి
- సీఎం జగనన్న చొరవతోనే దేశంలోనే ఓ గొప్ప నగరంగా తిరుపతి
- వైఎస్సార్‌సీపీలోకి భారీ ఎత్తున చేరిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు
- టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి


మునిశేఖర్‌రాయల్, నాయకులు, కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : రాష్ట్రంలో ఎన్ని పార్టీలు కలిసివచ్చినా.. ఎంతమంది ఏకమై వచ్చినా వచ్చే ఎన్నికల్లో గెలుపు మాత్రం వైఎస్సార్‌సీపీదేనని టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి పద్మావతి పురంలోని ఎమ్మెల్యే నివాసంలో గురువారం తిరుపతి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పాండు రంగయ్య కుమారుడు, తిరుపతి 27వ డివిజన్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు చీదళ్ల మునిశేఖర్ రాయల్‌తో పాటు వందమంది టీడీపీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ లాంటి వారు ఎంతమంది వచ్చినా, ఏకమై వచ్చినా రాష్ట్రంలో మరోసారి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రావడం, జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావడం తథ్యమన్నారు. సర్వేలన్నీ కూడా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తుందనే చెబుతున్నాయని తెలిపారు. జగనన్న చొరవతోనే దేశంలోనే ఓ గొప్ప నగరంగా తిరుపతి అభివృద్ధి బాటలో పయనిస్తోందన్నారు. తిరుపతి ప్రజలకు పెద్దఎత్తున రోడ్లు, నీటి సమస్య పరిష్కారంతో పాటు పారిశుద్ధ్య నిర్వహణ, వీధి లైట్ల ఏర్పాటు తదితర మౌలిక సదుపాయాలు మెరుగ్గా కల్పిస్తున్నామని తెలిపారు.

సుపరిపాలన నచ్చే వైఎస్సార్‌సీపీలోకి..

ఈ సందర్భంగా మునిశేఖర్ రాయల్‌తో పాటు వైఎస్సార్‌సీపీలో చేరిన వారు మాట్లాడుతూ టీడీపీ మరో 20 ఏళ్ల పాటు పనిచేసినా ప్రజలకు చిన్నపాటి మేలు చేయలేమన్నారు. ప్రజలకు సీఎం జగనన్న అందిస్తున్న సుపరిపాలన నచ్చే వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతి నగరాన్ని డిప్యూటీ మేయర్ భూమన అభినయ్‌రెడ్డి అభివృద్ధి చేయడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పాలగిరి ప్రతాప్ రెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, సీనియర్ నాయకులు దొడ్డారెడ్డి సిద్ధారెడ్డి, టి.రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు .

తిరుపతిలో 'నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు' రెస్టారెంట్లు


మీడియాతో మాట్లాడుతున్న జబర్దస్త్ కిర్రాక్ ఆర్పీ, హాజరైన ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: రాష్ట్రంలో జబర్దస్త్ ఆర్పీ బ్రాండ్‌తో ఆరంభమైన నెల్లూరు పెద్దిరెడ్డి చేపల పులుసు రెస్టారెంట్లు ఈనెల 19న తిరుపతి నగరంలో ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు చింతలచేను రోడ్డులోని స్టార్‌లైట్ హోటల్ ఎదురుగా నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు రెస్టారెంట్ల ఏర్పాటులో భాగంగా కట్టెల పొయ్యితో నూతనంగా ఏర్పాటు చేసిన అతి పెద్ది కిచెన్ సెంటర్‌ను గురువారం జబర్దస్త్ ఆర్పీ, తిరుపతి రెస్టారెంట్ల ఫ్రాంచైజీ ప్రతినిధులు వంశీకృష్ణ, ఏడుకొండలు, బాలాజీ కిరణ్, చంద్రశేఖర్, సుబ్రమణ్యంతో కలిసి కిచెన్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా జబర్దస్త్ ఆర్పీ మాట్లాడుతూ నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు అనతికాలంలోనే విశేష ఆదరణ పొందిందన్నారు. అందులో భాగంగానే తిరుపతి వారితో కలిసి నెల్లూరు పెద్దారెడ్డి చేపల పులుసు వంటకాలను చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాలకు సంబంధించి ఈనెల 19న తిరుపతిలో ఐదు బ్రాంచ్‌లను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

తిరుచానూరు బ్రహ్మోత్సవాల నిర్వహణపై సమీక్ష

- 18న పంచమి తీర్థానికి అమ్మవారి పుష్కరిణి ముస్తాబు
- టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈఓ ధర్మారెడ్డి

తిరుపతి కల్చరల్: తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టాలని టీటీడీ ఈఓ ఏవీ ధర్మారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తిరుపతి టీటీడీ పరిపాలన భవనంలోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎస్పీ, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఇతర టీటీడీ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఓ మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్, పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుని అమ్మవారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. నవంబర్ 14న గజ వాహనం, 18న పంచమి తీర్థానికి విశేషంగా భక్తులు వచ్చే అవకాశం ఉందని, పోలీసులు అధికారులతో సమన్వయం చేసుకుని ప్రత్యేక క్యూలు, తాగునీటి వసతి, వైద్యసౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు.

పంచమి తీర్థంకు ప్రత్యేక ఏర్పాట్లు..

పంచమితీర్థం నాడు శ్రీవారి పడి ఊరేగింపు అలిపిరి పాదాల మండపం నుంచి మొదలై కోమలమ్మ సత్రం, పసుపు మండపం మీదుగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుందని ఈఓ ధర్మారెడ్డి తెలిపారు. దారి పొడవునా గజరాజులకు ఇబ్బందులు లేకుండా ట్రాఫిక్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. అదేవిధంగా ప్రథమ చికిత్స కేంద్రాలు, అంబులెన్సులను అందుబాటులో ఉంచాలని కోరారు. నవంబరు 7న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 9న లక్ష కుంకుమార్చన, అంకురార్పణకు తగిన ఏర్పాట్లు చేపట్టాలన్నారు. వాహనసేవలను ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ పరమేశ్వర్ రెడ్డి, జేఈఓలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహ కిషోర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత, ఆలయ డెప్యూటీ ఈఓ గోవిందరాజన్, అర్చకులు బాబుస్వామి, మణికంఠ స్వామి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ యూ-19 జిల్లా జట్ల ఎంపిక పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్ : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 4, 5, 8వ తేదీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 సైక్లింగ్, మోడ్రన్ పెంటథలాన్, తైక్వాండో, అథ్లెటిక్స్ బాల బాలికల జట్లు ఎంపిక పోటీలు నిర్వహించనున్నారు. ఆ మేరకు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎస్.జయరామయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 4వ తేదీ ఉదయం 9.30 గంటలకు పూతలపట్టు జెడ్పీ హైస్కూల్ ఆవరణలో సైక్లింగ్, మధ్యాహ్నం 2.30 గంటలకు తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో మోడ్రన్ పెంటథలాన్, 5వ తేదీ ఉదయం 10గంటలకు అక్కడే తైక్వాండో, 8వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు తుమ్మలగుంట తుడా క్రీడా మైదానంలో అథ్లెటిక్స్ క్రీడల్లో ఎంపిక పోటీలు ఉంటాయని పేర్కొన్నారు. ఆయా పోటీలకు ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న విద్యార్థులు అర్హులని, ఈ పోటీలకు హాజరయ్యే క్రీడాకారులు పదో తరగతి మార్కుల జాబితా, స్టడీ సర్టిఫికెట్లు, ఆధార్‌కార్డు వెంట తీసుకురావాలని ఆయన కోరారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం


గుర్తు పట్టలేనంతగా మారిన శవం

తిరుపతి క్రైమ్: తిరుపతి-రేణిగుంట మధ్య ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలో ఓ వ్యక్తి రైలు కింద పడి మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. సుమారు 45 ఏళ్ల వయసు గల వ్యక్తి రైలు పట్టాలపై పడుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారన్నారు. అయితే ఇతని ఆచూకీ లభ్యం కాలేదని, ఎవరికైనా తెలిస్తే 9440627638 నంబరులో సంప్రదించాలన్నారు. దీనిపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించినట్లు చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

చంద్రగిరి: మండల పరిధిలోని నాగలపట్ల చెరువు వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని గురువారం స్థానికులు గుర్తించారు. చంద్రగిరి పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి సుమారు 70 ఏళ్లు వయసు ఉంటుందని, మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో గుర్తించలేని స్థితిలో ఉందన్నారు. అక్కడే పంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి మెడికల్ కళాశాలకు తరలించారు. మృతుడికి సంబంధించిన వివరాలను తెలిస్తే చంద్రగిరి పోలీసులను సంప్రదించాలని కోరారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

సత్యవేడు: ఐదు నెలల క్రితం సత్యవేడులో జరిగిన గుజిరీషాపు(పాత వస్తువుల కొనుగోలు) యజమాని ఎం.మైఖేల్ రాజ్ హత్య కేసులో నిందితుడు ఎం.గిరి(29)ని పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సత్యవేడు సర్కిల్ కార్యాలయంలో పుత్తూరు డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిందితున్ని మీడియా ఎదుట ప్రవేశ పెట్టారు. వివరాలు ఇలా.. తమిళనాడులోని తూత్తుకూడి జిల్లా వెంకటాచలపురానికి చెందిన మైఖేల్ రాజ్ సత్యవేడు-చెన్నై రోడ్డులో గుజిరీ షాపు(పాతసామాన్లు కొనుగోలు) నిర్వహిస్తున్నాడు. ఈ ఏడాది మే 30వ తేదీ రాత్రి షాపులో నిద్రిస్తుండగా ఓ గుర్తు తెలియని వ్యక్తి రాడ్డుతో తలపై కొట్టడంతో స్పృహతప్పి పడిపోయాడు. అనంతరం ఆ వ్యక్తి షాపులో మూటలు కట్టి ఉన్న అల్యూమినియం, ఇత్తడి సామగ్రిని ఎత్తుకెళ్లాడు. రక్తపు మడుగుల ఉన్న మైఖేల్ రాజును కుటుంబ సభ్యులు చెన్నై ఆస్పత్రికి తరలించగా జూన్ 5వ తేదీన మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. హత్యకు సంబంధించి ఒక్క క్లూ కూడా దొరకలేదు. దీంతో పోలీసులు పాతనేరస్తులపై నిఘా ఉంచారు. అయితే ఈ నెల 2వ తేదీ రాత్రి సీఐ శివకుమార్ రెడ్డి, సత్యవేడు ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి, వరదయ్యపాళెం ఎస్ఐ నాగార్జు రెడ్డి సిబ్బందితో కలిసి సత్యవేడులో గస్తీ నిర్వహిస్తుండగా సత్యవేడు దళితవాడకు చెందిన గిరి టూవీలర్‌పై ఇనుప రాడ్ పట్టుకుని అనుమానంగా తిరుగుతుండడాన్ని చూసి వెంబడించారు. అతన్ని పట్టుకుని విచారించగా సత్యవేడులో గుజిరీషాపు యజమానిని రాడ్‌తో తలపై కొట్టి, వస్తువులను చోరీ చేసినట్లు ఒప్పుకున్నాడు. డీఎస్పీ శ్రీనివాసరావు వ్యాపారి హత్య కేసును ఛేదించిన సత్యవేడు, వరదయ్యపాళెం ఎస్ఐలు, ఏఎస్ఐ చంద్రశేఖర్ సిబ్బందికి రివార్డులు అందజేశారు.

వ్యవసాయ పరిశోధన సంస్థలో గుజరాత్ రైతులు


డ్రోన్ సహాయంతో పిచికారీ విధానాన్ని పరిశీలిస్తున్న గుజరాత్ రైతులు

తిరుపతి సిటీ : తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానాన్ని గుజరాత్ రాష్ట్రం వల్సాడ్ జిల్లాకు చెందిన రైతుల బృందం గురువారం సందర్శించారు. ఆత్మ ప్రాజెక్టులో భాగంగా పరిశోధనా స్థానంలో అవలంబిస్తున్న ప్రకృతి సేద్యం పద్ధతులు, డ్రోన్ సహాయంతో పంటలపై పిచికారీ చేసే విధానంపై శాస్త్రవేత్తలు వారికి ప్రయోగాత్మకంగా వివరించారు. అదేవిధంగా ఆర్ఏఆర్ఎస్ నుంచి విడుదలైన పలు రకాల వేరుశనగ, మినుము, కంది పంటల వివరాలను రైతులు అడిగి తెలుసుకున్నారు. జీవన ఎరువుల ఉత్పత్తి కేంద్రంలో తయారవుతున్న జీవన ఎరువుల ప్రక్రియను వారు ఆసక్తిగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీఆర్ డాక్టర్ రమణ, సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ రవీంద్రారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బాల హుస్సేన్‌రెడ్డి, గుజరాత్ రైతులు పాల్గొన్నారు.

రాంగ్ రూట్‌లో వెళ్లొద్దు

- శ్రీనివాస సేతుపై రాంగ్ రూట్ వాహనాలను తనిఖీ చేస్తున్న డీపీటీఓ


ఆటోవాలాకు సూచనలు చేస్తున్న డీపీటీఓ చెంగల్‌రెడ్డి

తిరుపతి అర్బన్: రాంగ్ రూట్‌లో వెళ్లకండి.. ప్రమాదాలు కొని తెచ్చుకోకండి అంటూ జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్‌రెడ్డి సూచించారు. గురువారం ఆయన ఆర్టీసీ బస్టాండ్‌లో నుంచి రాంగ్ రూట్‌లో(వ్యతిరేక దిశగా) వెళుతున్న పలు ప్రైవేటు వాహనాలను ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బందితో కలసి తనిఖీ చేయించారు. తొలి తప్పుగా అపరాధ రుసుం లేకుండా వారికి అవగాహన కల్పించి పంపించారు. ఆర్టీసీ అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ రామచంద్రనాయుడు, పలువురు ఆర్టీసీ అధికారులు ఉన్నారు.